సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 31 । జనవరి । 2024



'కారుణ్య'ంపై కరుణ..

టీఎస్ ఆర్టీసీలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం లభించింది. త్వరలో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. - 8లో



సాహిత్యంతో సామాజిక చైతన్యం

సాహిత్యంతో ప్రజల్లో సామాజిక చైతన్యం వస్తుందని కేయూ వీసీ రమేష్ అన్నారు. రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. - 8లో

గరిష్టం/కనిష్టం

33.0^0 / 16.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఫిబ్రవరిలో ఈకేవైసీ పూర్తిచేయాలి

భూపాలపల్లి రూరల్: రేషన్‌డీలర్లు ఈ కేవైసీని ఫిబ్రవరి 29వ తేదీ వరకు 100శాతం పూర్తిచేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగారావు అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని రేషన్‌డీలర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. సమయపాలన పాటించి నిత్యావసర వస్తువులు లబ్ధిదారులకు సకాలంలో అందించాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: వచ్చే నెలలో జరిగే మేడారం జాతరలో పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత జాతరకోసం విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్, జిల్లా సైన్స్ అధికారి స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ విద్యావిభాగం ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో ప్లాస్టిక్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 8, 9 తరగతుల విద్యార్థులతో మాదిరి జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడక నిషేధం, సౌకర్యాల కల్పన, పర్యావరణ పరిరక్షణ అంశాలపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, విద్యాకమిటీ సభ్యులు, పోలీస్ అధికారులను భాగస్వాములను చేసి అవగాహన కల్పించాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భూపాలపల్లి రూరల్: తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లాకు సంబంధించిన క్యాలెండర్‌ను మంగళవారం జెడ్పీ కార్యాలయం ఆవరణలో జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ, జెడ్పీటీసీలు గుడాల అరుణ, శ్రీమతి లింగంపల్లి శారద, ఉద్యోగుల సంఘం నాయకులు విజయపాల్ రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సయ్య మాదిగ



భూపాలపల్లి రూరల్: సింగరేణి ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన రేగుంట నర్సయ్య మాదిగను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నర్సయ్యకు నియామక పత్రం అందజేశారు.

కోటంచలో వేలం పాట



రేగొండ: మార్చిలో మండలంలోని కోటంచ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దుకాణాల సముదాయం ఏర్పాటు కోసం మంగళవారం వేలం పాట నిర్వహించారు. పేలాలు, పుట్నాలు, నూనె గురుగులు, కొబ్బరికాయలు, పూజసామగ్రి, పూలదండలు తదితర వాటికి వేలం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ-ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఆలయ చైర్మన్ మాదాడి అనిత, ధర్మకర్తలు కనుకుంట్ల దేవేందర్, పోగు సుమన్, కోళ్ల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను సాకారం చేయాలి



భూపాలపల్లి: ప్రతీ ఒక్కరు గాంధీజీ ఆశయాలను సాకారం చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి, మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయుధం లేకుండా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి గాంధీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, వర్టికల్ డీఎస్పీ నారాయణనాయక్, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు చెక్

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

- కూలీల ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్
- ఎన్ఎంఎంఎస్ యాప్ రూపకల్పన
- ఏప్రిల్ నుంచి అమలయ్యే అవకాశం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కాటారం: ఉపాధిహామీ పథకం పనుల్లో అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోంది. ఇప్పటికే పని ప్రదేశంలో కూలీల ఫొటోలతో కూడిన అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తోంది. బోగస్ కూలీలకు పూర్తిగా చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం ప్రవేశపెట్టే ఆలోచన చేస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) యాప్‌ను రూపొందించింది. దీని పనితీరును క్షేత్రస్థాయిలో అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. అది విజయవంతమైతే వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) నుంచి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

ఫొటో మ్యాచ్ అయితేనే..

జిల్లాలో 1,18,327 జాబ్‌కార్డులు ఉన్నాయి. కూలీల సంఖ్య 2,42,172 ఉండగా.. 1,45,390 కుటుంబాలు ఉపాధి పనులకు హాజరవుతున్నాయి. వారందరి వివరాలు ఆధార్ కార్డులతో అనుసంధానం చేశారు. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. నూతన విధానంలో ఆధార్ సర్వర్‌తో అనుసంధానమై ఉన్న ఎన్ఎంఎంఎస్ ప్రత్యేక యాప్‌లో కూలీల ముఖాలు ఫొటో తీస్తారు. ఈ ఫొటో ఆధార్‌లో అంతకుముందు దిగిన ఫొటోతో జత కలిస్తేనే కూలీలకు హాజరు పడుతుంది. తమ పరిధిలో పనిచేసే కూలీల వివరాలు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ యాప్‌లో ముందుగానే నమోదు చేసుకుని సిద్ధంగా ఉంటారు. ఈ విధానం బాగానే ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న విధానంలో ఒక్కో కూలీ అటెండెన్స్ నమోదు చేసేందుకు 7 నుంచి 8 నిమిషాల సమయం పడుతుందని చెబుతున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య కూడా ఇందుకు అవరోధంగా మారుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధిహామీ పథకం వివరాలు..

మండలాలు	11
గ్రామపంచాయతీలు	241
గ్రామాలు	391
జాబ్‌కార్డులు	1,18,327
కూలీల సంఖ్య	2,42,172
పని చేస్తున్న కూలీ కుటుంబాలు	1,45,390

నూతన యాప్‌తో చిక్కులు..

ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్ అమల్లోకి వస్తే పారదర్శకత నెలకొనడంతో పాటు చిక్కులు సైతం ఎదురవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానంతో కూలీల సంఖ్య తగ్గడంతో పాటు పనులపై ప్రభావం చూపనుందని చెప్పుకొస్తున్నారు. జిల్లాలో అధికంగా మారుమూల గ్రామాలు ఉండటంతో నెట్‌వర్క్ సమస్య ఉంటుంది. దీని కారణంగా పనిచేసిన కూలీకి సంబంధించిన హాజరు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే కూలి కోల్పోవాల్సి వస్తుంది. పలుమార్లు ఇదే ప్రక్రియ పునరావృతం అయితే కూలీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని అధికారులు వాపోతున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట..

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఉపాధిహామీ పథకాన్ని కొందరు అక్రమాలకే కేరాఫ్‌గా మార్చారు. గతంలో పర్యవేక్షణ లోపం ఉండటంతో ఉపాధిహామీలో పనిచేసే సిబ్బంది బోగస్ కూలీల పేరిట లక్షలాది రూపాయలు కాజేశారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, పలుకుబడి కలిగిన వ్యక్తుల కుటుంబీకులు పనులకు వెళ్లకున్నా హాజరైనట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు వారి అటెండెన్స్ వేసుకొని నిధులు స్వాహా చేశారు. గ్రామాల్లో నిర్వహించిన అనేక సామాజిక తనిఖీల్లో ఈ విషయం స్పష్టమయింది. లక్షలాది రూపాయలు పక్కదారి పట్టినట్లు వెల్లడైంది. తాజాగా అమలు చేయనున్న నూతన విధానంలో ఇలాంటి వాటికి పూర్తిస్థాయిలో చెక్‌పడటంతో పాటు పనులకు హాజరైన కూలీలకే ప్రయోజనం కలుగనుంది. ఉపాధిహామీ పనుల్లోనూ పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఫెషియల్ రికగ్నైజేషన్ విధానం అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు.

సాంకేతిక ఇబ్బందులు..



ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నాం. పలు గ్రామాల్లో నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విధానం కూలీల సంఖ్యపై ప్రభావం చూపే అవకాశం ఉంది. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తాం.

- పురుషోత్తం, డీఆర్‌డీఓ

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు

- పార్లమెంట్ ఎన్నికల్లో విధులు సక్రమంగా నిర్వర్తించాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఏడు కమిటీల అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి: మాదకద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలన అంశంపై మంగళవారం సంబంధిత అధికారులతో తన చాంబర్‌లో ఎన్‌సీఓఆర్‌డీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో డ్రగ్స్ వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాలు వ్యసనం ఉన్న వారిని గుర్తించాలన్నారు. గంజాయి వాడేవారు ప్రతీ గ్రామంలో ఉన్నారని, వారి ద్వారా సరఫరా చేసే వారిని గుర్తించి కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలనలో విద్యాశాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థల పరిసరాల్లో గల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ఉపాధ్యాయుల ద్వారా మాదకద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాలు వాడే విద్యార్థులను గుర్తించి వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. పాఠశాలల్లో వ్యత్యాసంగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించి, దానికి గల కారణాలను విచారించాలని చెప్పారు. అదనపు ఎస్పీ ఎ.నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ మాసంలో ఐదు గంజాయి కేసులు నమోదు చేసి నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని 9మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు 25 కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్‌ఓ వి.శ్రీధర్, డీఏఓ విజయభాస్కర్, అటవీ, ఎక్సైజ్, విద్యా, పోలీసుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సక్రమంగా విధులు..

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో సెక్టోరియల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు.త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలపై సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం 108 అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఏప్రిల్ నెలలో కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. సెక్టోరియల్ అధికారులు వారి వారి రూట్లను పరిశీలించుకోవాలని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్లమెంటు ఎన్నికల్లో ఇబ్బందులు లేకుండా సెక్టోరియల్ అధికారులు విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఆర్డీఓ రమాదేవి, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

కార్యకలాపాలు సాగేందుకు చర్యలు..

సమీకృత కలెక్టరేట్ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్ నిర్వహణపై మంగళవారం జిల్లా అధికారులతో కూడిన ఏడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సమీకృత కలెక్టరేట్‌ను గత ఏడాది అక్టోబర్ 9న ప్రారంభించుకున్నామని, అనంతరం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు కలెక్టరేట్‌కు షిఫ్ట్ అయ్యాయని తెలిపారు. కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపేందుకు, కలెక్టరేట్ వివిధ శాఖల కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయమని ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ అభివృద్ధిలో గ్రామాలకు పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 100 పడుకల ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. 100 పడకల ఆస్పత్రిలో ఎంఆర్ఐ, సీటి స్కాన్, రక్త కణాల మిషన్‌లను ఏర్పాటు చేసి భూపాలపల్లి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేసే విధంగా చూస్తామన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్యనారాయణరావును సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఆర్డీఓ పురుషోత్తం, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, జెడ్పీటీసీలు, అధికారులు విజయభాస్కర్, సంజీవరావు, శ్రీదేవి, అవినాష్ పాల్గొన్నారు.

విధుల్లోకి రాని అర్చకులు?

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు అర్చకులు విధుల్లోకి రావడం లేదని తెలిసింది. ఇద్దరు పర్మనెంట్ అర్చకులు కాగా, మరో ఇద్దరు తాత్కాలిక వేతనం లేని ఒప్పంద అర్చకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ నలుగురి అర్చకుల ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో వారిని ఆలయ అధికారులు విధుల్లోకి కొన్ని రోజులుగా రానివ్వడం లేదని సమాచారం. దేవస్థానం అధికారులు ఈ విషయం బయటకు రాకుండా రహస్యంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వేములవాడ, కొండగట్టు, మేడారం జాతరలకు వెళ్లి వచ్చే భక్తులతో కాళేశ్వరాలయం నెల రోజులుగా నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ఆలయంలో అర్చకులు లేక భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదని తెలిసింది. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పాలకవర్గం కూడా పట్టింపులేని తనంతో ఆలయం నిర్వహణ గాడితప్పుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రమాదాల నివారణకు భద్రతా నియమాలు

ఎంవీఐ సంధాని



రక్తదానం చేస్తున్న ఎంవీఐ సంధాని

భూపాలపల్లి: ప్రమాదాల నివారణకు వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని భూపాలపల్లి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంధాని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో భూపాలపల్లి లారీడ్రైవర్ అసోసియేషన్, చెల్పూరు, గొర్లవీడు ఆటో యూనియన్‌కు సంబంధించిన డ్రైవర్లు, ఇతర సిబ్బంది సుమారు 50మంది వరకు పాల్గొని రక్తదానం చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నిశిధర్‌రెడ్డి



నిశిధర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రేగొండ మండల కేంద్రానికి చెందిన ఏడునూతుల నిశిధర్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ప్రకటించారు. నిశిధర్ తండ్రి ఏడునూతుల విజేందర్‌రెడ్డి రేగొండ మండల అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి మేనల్లుడిగా నిశిధర్‌రెడ్డికి గుర్తింపు ఉంది. 2016నుంచి భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. 2019 సర్పంచ్ ఎన్నికల్లో రేగొండ సర్పంచ్‌గా బీజేపీ నుంచి గెలుపొందారు.

మిగిలింది ఒక్కరోజే..

'మేడారం మహాజాతర అభివృద్ధి పనులు ఈనెలాఖరు వరకు పూర్తిచేయాలి.. పనుల్లో నాణ్యత ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తాం.. అధికారులు, ప్రజాప్రతినిధులు, పూజారులు, భక్తుల సహకారంతో జాతర విజయవంతానికి కృషిచేస్తాం.. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి భక్తులకు కాటన్ సంచులు అందుబాటులో ఉంచాం.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రోడ్డు విస్తరణ, మరమ్మతులు చేపట్టాలి'..

- ఈనెల 17వ తేదీన మేడారంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ

మహాజాతర పనులకు మంత్రులు విధించిన డెడ్‌లైన్ నేటితో ముగింపు

- అధికారుల్లో టెన్షన్.. పరుగెత్తుతున్న కాంట్రాక్టర్లు
- ముందుకు కదలని ఆర్అండ్‌బీ, దేవాదాయశాఖ పనులు
- కొన్నిచోట్ల రోడ్లపై అప్పుడే గీతలు.. ఎగుడుదిగుడుగా నిర్మాణం



వాగులో ఇసుక బస్తాలను అడ్డుగా వేస్తున్న కూలీలు



కొనసాగుతున్న ఆర్అండ్‌బీ పనులు





జీపీ షీట్స్ మరుగుదొడ్లకు బేస్‌మెంట్ కడుతున్న కూలీలు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతర పనులన్నీ ఈనెల 31 వరకు పూర్తి చేయాల్సి ఉండగా డెడ్‌లైన్‌కు ఒక్క రోజే సమయం మిగిలి ఉంది. సమ్మక్క-సారలమ్మ జాతరకు ఇంకా 21 రోజులే గడువు ఉంది. ఈ మహాజాతరకు కోటి మంది భక్తులు హాజరవుతారని అంచనాతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ మేరకు పనుల డెడ్‌లైన్‌కు విధించిన గడువు బుధవారంతో ముగియనుండడంతో అధికారుల్లో టెన్షన్ నెలకొంది. కొన్ని శాఖల పనులు చివరి దశకు చేరుకోగా,ప్రధానమైన రెండు శాఖల పనులు కొనసాగుతున్నాయి. ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ నిత్యం మేడారంలోనే పర్యవేక్షిస్తుండటంతో పనుల్లో వేగం పుంజుకుంది.

ఆర్టీసీ బస్టాండ్‌లో క్యూలైన్ పనులు పూర్తి..

మేడారం బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లు వేగవంతంగా సాగుతున్నాయి. క్యూలైన్ పనులు, బుకింగ్ కౌంటర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని క్యూలైన్లు కలిపి సుమారు 10 కిలోమీటర్ల వరకు నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు. జాతర విధుల్లో పాల్గొనే ఆర్టీసీ సిబ్బంది విడిది కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. బస్టాండ్ ఏర్పాటుకు ఉపయోగించిన 50 ఎకరాల స్థలంలో ప్రయాణికుల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. కాగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో ఇసుక లెవలింగ్ పూర్తి కాగా 11 ఇన్ ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత పనులు పూర్తయ్యాయి. భక్తుల స్నానాల కోసం స్నానఘట్టాలపై 300 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా జంపన్నవాగులో నీటి లభ్యత కోసం వాగులో 9 ప్రాంతాల్లో ఇసుక బస్తాలు ఏర్పాటు పూర్తి కాగా ఇంకా 5 చోట్ల పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే భక్తులకు షవర్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. దుస్తులు మార్చుకునేందుకు డ్రెస్సింగ్ గదులు కూడా సిద్ధం చేశారు.

మారని ఆర్అండ్‌బీ తీరు..

ఆర్అండ్‌బీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు పనులు డెడ్‌లైన్ వరకు పూర్తి చేయాలని మంత్రులు ఆశాఖ అధికారులను ఆదేశించినా వారిలో మార్పు రాలేదు. బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టగా నాణ్యత లోపించి రోడ్డుపై గీతలు పడి ఎగుడుదిగుడుగా కనిపిస్తోంది. శివరాంసాగర్ చెరువు నుంచి తాడ్వాయి మార్గంలో గట్టమ్మ గుడి మూల మలుపు వరకు తారు వేయాల్సి ఉండగా ప్యాచ్ వర్క్ మాత్రమే చేసి వదిలేశారు. బుధ, గురు, ఆదివారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆ రోజుల్లో పనులు సాగకపోగా భక్తులు రాని రోజుల్లో కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో..

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లోని 10 క్లస్టర్లలో 520 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు నాలుగైదు క్లస్టర్లలో నల్లాల ఏర్పాటు పూర్తి కాగా మిగతా పనులు సాగుతున్నాయి. తాత్కాలిక జీపీ షీట్స్ మరుగుదొడ్ల ఏర్పాటుకు బెస్‌మెంట్‌లు కట్టి సిద్ధంగా ఉంచారు. ఫిబ్రవరి 15 కల్లా మరుగుదొడ్ల పనులు పూర్తి చేయనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. జంపన్నవాగులో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 11 ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడిక పనులు పూర్తి చేశారు.

దేవాదాయ శాఖ పనులు అంతే..

మేడారంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. అమ్మవార్ల గద్దెల ప్రాంగణం సాలాహారానికి రంగులు, ప్రధాన ఆర్చీలకు పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. కిచెన్ షెడ్ నిర్మాణం పనులు ఇంకా పునాది దశలోనే సాగుతున్నాయి. క్యూలైన్లకు రంగుల పనులు పూర్తయ్యాయి. క్యూలైన్లపై భక్తుల నీడ కోసం ఏర్పాటు చేయాల్సిన తడకల ఏర్పాటు పనులు ఇంకా మొదలు కాలేదు.

విద్యుత్ శాఖ పనులు క్లోజ్

విద్యుత్ శాఖ చేపట్టిన పనులన్నీ పూర్తయ్యాయి. జాతర నాలుగు రోజులు విద్యుత్ సరఫరా నిరంతరం అందించేందుకు ఆ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్ లైన్ పనులతోపాటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులన్నీ కూడా మంత్రి సీతక్క విధించిన డెడ్‌లైన్‌కు ముందే పూర్తయ్యాయి. జాతరలో అన్ని పనుల కంటే విద్యుత్ శాఖ పనులు ముందస్తుగా పూర్తయ్యాయి.

కారుణ్యంపై కరుణ..

ఎట్టకేలకు నియామకాలకు కసరత్తు

- ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో కొనసాగుతున్న ప్రక్రియ
- మేడారం జాతరలోపు నియామక ఉత్తర్వులు



హన్మకొండ : టీఎస్ ఆర్టీసీలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కారుణ్య నియామకాలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో వరంగల్ రీజియన్‌లో అధికారులు కసరత్తు చేపట్టారు. ఉద్యోగం చేస్తూ మృతి చెందిన మృతుల కుటుంబాలతో పాటు స్వచ్ఛంద విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు యాజమాన్యం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు అర్హులను గుర్తించేందుకు అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేశారు. మరో వైపు మెడికల్ టెస్టులు కూడా పూర్తి చేసినట్లు సమాచారం. ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాల్సి ఉంది. అయితే ఎనిమిదేళ్లుగా కారుణ్య నియామకాలు చేపట్టలేదు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటూ మృతి చెందిన ఆ కుటుంబానికి భరోసా కల్పించేందుకు కుటుంబీకుల్లో ఒక్కరికి వెంటనే ఉద్యోగావకాశం కల్పించాల్సి ఉంది. అయితే ఈ విషయంలో పాలకులు, యాజమాన్యం.. నిర్లక్ష్యం, వివక్ష చూపడంతో మృతుల కుటుంబాలు చతికిల పడ్డాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూపులే మిగిలాయి. ఈ తరుణంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు ఈ నియామకాలకు మోక్షం లభించింది.

2016 నుంచి నిలిచిన నియామకాల ప్రక్రియ

టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో 2016 నుంచి కారుణ్య నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నియామకాల కోసం 80 మంది, ముందస్తుగా ఉద్యోగ విరమణ చేసిన వారు కుటుంబీకులు 30 మంది దరఖాస్తు చేసుకున్నారు. వరంగల్ రీజియన్‌లో ప్రస్తుతం 21 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో ప్రస్తుతమున్న ఉద్యోగులపై పని భారం పెరిగింది. త్వరలో కొత్త బస్సులు రానుండడంతో మానవ వనరులను సమకూర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో 65 మందికి నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ మేరకు అర్హులైన అభ్యర్థులను గుర్తించే పనిలో అధికారులున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతున్నారు. అయితే పోస్టులు తక్కువగా ఉండడంతో దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవకాశాలు అందేలా కనిపించడం లేదు. ఫిబ్రవరిలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర జరుగనుండడంతో అధిక సంఖ్యలో సిబ్బంది అవసరముంది. ఈ క్రమంలో జాతర నాటికి ఉద్యోగులను సమకూర్చుకునేందుకు కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతం చేశారు. రెండు, మూడు రోజుల్లో నియామక ఉత్తర్వులు అందించేందుకు కసరత్తు పూర్తి చేస్తున్నారు.

త్వరలో నియామకాలు..



ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో త్వరలో కారుణ్య నియామకాలు చేపడతాం. ఇప్పటికే ప్రక్రియ మొదలైంది. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. నిబంధనల మేరకు నియామకాలు చేపడతాం. మేడారం జాతరలోపు నియామక పత్రాలు అందించి వారి సేవలను ఉపయోగించుకుంటాం.

జాస్తి శ్రీలత, ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం

సమస్యల పరిష్కారమే రైల్వే సంఘ్ ధ్యేయం

- సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ ప్రభురాజ్

కాజీపేట రూరల్ : కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నిరంతరం కృషి చేస్తోందని సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి. ప్రభురాజ్ అన్నారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో మంగళవారం హెడ్‌క్వార్టర్ బ్రాంచ్ సర్వసభ్య సమావేశం సందర్భంగా సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ నాగ వెంకట నర్సయ్య చౌదరి పదవి విరమణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు చౌదరి, ప్రభురాజ్ మాట్లాడారు. సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ సాధినేని వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డివిజన్ సెక్రెటరీ కొత్త మురళీకృష్ణ, నాయకులు బుచ్చిరెడ్డి, వేగి మురళీకృష్ణ, నాగరత్నం, కె.ఎస్.రావు, ముస్తాక్ హుస్సేన్, ఇ.నర్సింగరావు, గుత్తికొండ నారాయణ, రమేష్‌బాబు, అనిల్‌కుమార్, వెంకటస్వామి, రవికాంత్, మాధవరావు, మహేందర్, ముస్తాక్ అలీ, నీలి రవీందర్, రాజ్‌కుమార్, సదా శ్రీను, యాకాంబ్రం, నజీర్, నవీన్, రాకేష్, భానుప్రకాష్, నిమ్మ యాకయ్య, గౌస్, దినేష్, విజయ్, బాబురావు పాల్గొన్నారు.

అంతరాలు లేని విద్య ప్రజల హక్కు

విద్యారణ్యపురి: అంతరాలు లేని విద్య ప్రజల హక్కు అని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ అన్నారు. ఫిబ్రవరి 11,12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యావైజ్ఞానిక మహాసభల్లో అనేక విద్యారంగ సమస్యలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు వి.అజయ్‌బాబు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, ఉపాధ్యక్షుడు జె.స్వామి, బాధ్యులు యు.అశోక్, బెల్లంకొండ పూర్ణచందర్, డి.రమేష్, దినేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ అరెస్టు

కొత్తగూడ: భర్త మృతికి కారణమైన భార్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గూడూరు సీఐ ఫణీధర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం కొత్తగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొత్తగూడ మండలం కర్నెగండి గ్రామానికి చెందిన ఊకు శ్రీనివాస్(35) వారం క్రితం మృతి చెందాడు. ఈఘటనపై తనకు అనుమానం ఉందని మృతుడి సోదరుడు కాంతారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దంపతులు గొడవ పడుతున్న క్రమంలో శ్రీనివాస్ తలపై భార్య ప్రమీల కర్రతో కొట్టగా శ్రీనివాస్ మృతి చెందాడు. దీంతో ప్రమీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నగేష్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఏదునూరి ఉదిత్ (15) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏదునూరి కృష్ణ, రజిత దంపతుల ఏకైక కుమారుడు ఉదిత్ ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఉదిత్ ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉదిత్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి పాఠశాలకు సెలవు ప్రకటించారు. కాగా, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య.. ఉదిత్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పెంచిన వేతనాలు అమలు చేయాలి

- కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో దినసరి వేతనం, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు పెంచిన వేతనాల జీఓను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. తొలుత వీసీ ఆచార్య టి.రమేష్‌తో మాట్లాడారు. వీసీ అక్కడి నుంచి వెళ్లిపోయాక రిజిస్ట్రార్ ఉండగా అతనితో వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రార్ అక్కడి నుంచి తన చాంబర్‌కు వెళ్లగా అక్కడి చేరుకొని కారిడార్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఉద్యోగ సంఘాల బాధ్యులు మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్‌లోనే అప్పటి ప్రభుత్వం నుంచి వేతనాల పెంపుదలతో పాటు ఆయా ఉద్యోగులకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికను ర్యాటిఫికేషన్ ఇచ్చారన్నారు. కాగా ఇప్పటివరకు ఆ వేతనాలు పెంపుదల చేస్తున్నట్లుగా యూనివర్సిటీ అధికారులు ప్రకటించారే కాని అమలుచేయకుండా కమిటీల పేర కాలయాపన చేశారని ఆరోపించారు. అయితే యూనివర్సిటీ వీసీ ,రిజిస్ట్రార్లు వేతనాల పెంపునకు సంబంధించిన జీఓ ప్రకారం తమకు వేతనాలను పెంపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ ఆందోళనలో కేయూ దినసరి వేతన, తాత్కాలిక ఉద్యోగుల సంఘాల బాధ్యులు నాగుల శివప్రసాద్, దయాకర్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, సంగాల రాజమౌళి ఆయా ఉద్యోగులున్నారు. రిజి స్ట్రార్ చాంబర్‌లో ఉండగా ఆయా ఉద్యోగులు మాత్రం రిజిస్ట్రార్ కారిడార్‌లో బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఉత్తర్వులు ఇచ్చేవరకు ఇక్కడనుంచి కదలబోమని ఆయా సంఘాల బాధ్యులు స్పష్టం చేశారు. కాగా, ఉద్యోగుల నిరసన రాత్రి11గంటల వరకు కొనసాగింది.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నేటినుంచి సీఐటీయూ జాతీయ సమావేశాలు

న్యూశాయంపేట: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు జనవరి 31(నేడు) నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు హనుమకొండ నగరంలో జరగనున్నాయి. ఈ సమావేశాల సందర్భంగా నగరంలో గోడ రాతలు, తోరణాలు, ఎర్రజెండాలతో అలంకరించారు. సమావేశాల మొదటి రోజు హనుమకొండలోని వేయిస్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు వేలాది మందితో కార్మిక మహా ప్రదర్శన ఉంటుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. ఈ బహిరంగ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశాలకు దేశంలోని 28 రాష్ట్రాల నుంచి 400 మంది కార్మిక నాయకులు హాజరవుతారని తెలిపారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యం



మాట్లాడుతున్న వీసీ తాటికొండ రమేష్

- కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్

కేయూ క్యాంపస్ : సాహిత్యంతో ప్రజల్లో సామాజిక చైతన్యం వస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో 'కాకతీయ విశ్వవిద్యాలయం, వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ' సంయుక్త ఆధ్వర్యంలో 'వల్లంపట్ల సాహిత్యం – సామాజిక చైతన్యం' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. చైతన్య శీలి, ఆచరణవాది, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్ రావు అన్నారు. సాహిత్యం, సామాజిక చైతన్యం వేర్వేరు కాదన్నారు. అన్నింటికీ మూలం సామాజిక చైతన్యమేనన్నారు. వల్లంపట్ల నాగేశ్వర్‌రావు ప్రభుత్వ కార్యక్రమాలను కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నారని కొనియాడారు. విశిష్ట అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ సమాజంలోని సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి ఐదు దశాబ్దాల నుంచి నిర్విరామంగా కృషి చేస్తున్న వల్లంపట్ల నాగేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ సదస్సుకు కేయూ తెలుగు విభాగం అధిపతి, ఆర్ట్స్ డీన్ బన్న ఐలయ్య అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాకూర్, కవయిత్రి, రచయిత్రి అనిశెట్టి రజిత, ఆచార్య పి.కృష్ణమాచారి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ సెషన్లలో వల్లంపట్ల నాగేశ్వర్‌రావు సమగ్రసాహిత్యంపై వివిధ అంశాలల్లో పలువురు పరిశోధన పత్రాలు సమర్పించారు.

42 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్: కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైలులో తరలిస్తున్న రూ.10.50 లక్షల విలువైన 42 కిలోల 630 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకుని, ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ ఉమ్మడి వరంగల్ ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.నాగేందర్ రావు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటన వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ ఉమ్మడి వరంగల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు, సిబ్బంది రైళ్లలో నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్లే కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైలులో మహారాష్ట్రలోని పూణెకు చెందిన మేఘా రాజేంద్ర రోక్ డే, విజయ్ భరత్ సదావర్కే అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి వద్దకు ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది వెళ్తుండగా విజయ్ భరత్ సదావర్కే పారిపోగా మేఘా రాజేంద్ర రోక్ డే పట్టుబడింది. దీంతో ఆమె బ్యాగులు తనిఖీ చేయగా 42 కిలోల 630 గ్రాములు ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో సరుకును స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేసి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ఎండు గంజాయి విలువ రూ.10.50 లక్షలు ఉంటుంది. నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా పాడేరు నుంచి మహారాష్ట్రలోని పూణెకు 19 ప్యాకెట్లను 3 మూడు బ్యాగుల్లో తరలిస్తున్నారు. ఇందులో మేఘా రాజేంద్ర రోక్ డే పట్టుబడగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చనున్నట్లు నాగేందర్ రావు పేర్కొన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ బి.శ్రీనివాసరెడ్డి, సీఐ టి.శ్రీనివాసులు, ఎస్సై ఎన్.రజితారెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.కిరణ్ నాయక్, సీఐ జి.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావు

'పరుష భాషకు చోటులేదు'



వెంకటనారాయణ, ప్రొఫెసర్

హన్మకొండ: పరుష భాష, తిట్ల పురాణానికి ప్రజాస్వామ్యంలో చోటు లేదని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తెలిపారు. పదేళ్లుగా పరిపాలన అనుభవించి అధికారం కోల్పోయిన నాయకులు అసహనానికి గురికావడం దురదృష్టకరమన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని వందలాది మంది నాయకులు, కుటుంబ సభ్యులు ఆస్తులు, సంపద, ఫామ్ హౌజ్‌లు సొంతం చేసుకున్న విషయం ప్రజలు ఇంకా మర్చిపోలేదనే వాస్తవాన్ని గ్రహించాలని సూచించారు. సభ్య సమాజం చిత్కారం చేస్తోందని గమనించకుండా నిత్యం తిట్ల పురాణాన్ని వల్లించడం నాగరికత లక్షణం కాదని వెంకటనారాయణ హితవు పలికారు.బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు రోజూ ప్రత్యర్థి రాజకీయ నాయకులను పరుష భాషతో విమర్శించడం, తిట్ల పురాణం వల్లె వేయడం తెలంగాణ సంస్కృతీ కాదని గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రిని, జాతీయ నాయకులు ప్రధాన మంత్రిని గౌరవించే సంస్కృతీ కోల్పోతే ప్రజలు సహించరన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పట్ల నమ్మకం లేని వాళ్లు ప్రజా జీవనంలో ఉండే అర్హత కోల్పోతారని, భాష కాసింత నియంత్రణతో వాడడం అవసరమని యువ నాయకుడు కేటీఆర్‌కు సూచించారు.

గాడ్సే వెనుక ఉన్నది ఎవరు?



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

- ఐఎన్‌ఎం జాతీయ అధ్యక్షుడు కృష్ణప్రసాద్

రామన్నపేట: మహాత్మాగాంధీని హత్య చేసింది గాడ్సే అయినప్పటికీ ఆ గాడ్సే వెనుక ఎవరున్నారు.. ఎందుకు హత్య చేశారు? అనే సమాధానాలు చెప్పాల్సిన అవసరం పాలకులపై ఉందని ఇండియన్ నేషనలిస్ట్ మూమెంట్(ఐఎన్‌ఎం) జాతీయ అధ్యక్షుడు మోటూరి కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ మత రాజకీయాలు చేసి ముస్లిం, సిక్కు, క్రిస్టియన్లు, మైనార్టీలకు నష్టం చేస్తోందన్నారు.రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌ఎం నేషనల్ కోఆర్డినేటర్ ఎండీ ఆయూబ్, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు, ఇనాం రీజనల్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫర్వేజ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాబర్, సిక్కు మైనార్టీ నాయకులు సర్దార్ హరిసింగ్, కాంగ్రెస్ నాయకులు రాచర్ల కుమారస్వామి పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్

కరీమాబాద్: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే అధిక దిగుబడులు లభిస్తాయని వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ అన్నారు. మంగళవారం మామునూరు కేవీకేలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగును నియంత్రిస్తే కూలీల ఖర్చు తగ్గి రైతులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడంతో పంట త్వరగా కోతకు రావడమే కాకుండా ఇతర పంటలు వేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ పత్తి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఓంప్రకాష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగపాణి, కేవీకే శాస్త్రవేత్తలు రాజు, సౌమ్య, శశాంక్, సాయికిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్

పాత కక్షలతో యువకుడి హత్య

- కౌకొండలో ఘటన



యుగంధర్(ఫైల్)

నడికూడ: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మండలంలోని కౌకొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల యుగంధర్(26) సోమవారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన నాటికను చూడడానికి వెళ్లాడు. అనంతరం స్నేహితులతో కలిసి చలిమంట కాగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున అదే గ్రామానికి చెందిన మేకల సిద్దు.. పాత కక్షల నేపథ్యంతో యుగంధర్‌పై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దీంతో స్థానికులు యుగంధర్‌ను పరకాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న పరకాల ఏసీపీ కిశోర్ కుమార్, పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై కొంక అశోక్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై మృతుడి బంధువు మేకల రాజవీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై కొంక అశోక్ తెలిపారు. కాగా, మృతుడు ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ నేత సాయిబాబు

కరీమాబాద్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు అన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట రామ సురేందర్ భవన్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల రాష్ట్రస్థాయి సదస్సుకు వంగురు రాములు అధ్యక్షత వహించగా సాయిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టే కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మిక హక్కులు బలహీనం చేసిందని విమర్శించారు. దేశవ్యాప్త సమ్మెలో 54 రకాల భవన నిర్మాణ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. అలాగే, ఫిబ్రవరి 16వ తేదీన గ్రామ, మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ముదాం శ్రీనివాస్, ఎలుక సోమయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసులు, గాలయ్య, ఉప్పలయ్య, కోటేశ్వర్‌రావు, వెంకన్న, రవి, రామస్వామి, నారాయణ, జంగయ్య, సోములు, నరసింహారావు, రమేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



కరీమాబాద్ : మాట్లాడుతున్న సాయిబాబు

డీసీఎల్‌కు సమ్మె నోటీసు

హన్మకొండ చౌరస్తా: దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో హనుమకొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ (డీసీఎల్) రమేష్‌బాబుకు మంగళవారం నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, వివిధ కార్మిక సంఘాల బాధ్యులు బానోత్ వెంకన్న, రాచమల్ల వెంకటేశ్, పుల్ల అశోక్, కూస రాజేశ్, గద్దల కుమార్, వల్లపు రాజు, మల్లెపు లింగమూర్తి, శ్రీను, నారాయణ పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శికి సమ్మె నోటీస్

వరంగల్: కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఫిబ్రవరి 16వ తేదీన సమ్మె నిర్వహిస్తున్నామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్యకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర రామస్వామి, గంగుల దయాకర్, గన్నారపు రమేష్, పుల్లా రమేష్, జగదీశ్వర్, ఖాసీం , జ్ఞానేందర్, చెన్న కేశవులు, సుధాకర్, పాషా పాల్గొన్నారు.

డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ

హన్మకొండ: తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో డైరెక్టర్ పోస్టుల భర్తీకి యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి వరకు కొనసాగుతున్న డైరెక్టర్‌లను తొలగించగా ఖాళీ అయ్యాయి. దీంతో ఇన్‌చార్జ్‌లను నియమించారు. గతంతో ఆరుగురు డైరెక్టర్లను నియమించగా ఒక్కరు బాధ్యతలు చేపట్టకపోగా, మరొకరు మధ్యలోనే రిజైన్ చేశారు. ఈ సంఖ్యను కుదిస్తూ నలుగురు డైరెక్టర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఫైనాన్స్, హెచ్‌ఆర్‌డీ అండ్ ఐఆర్, ఆపరేషన్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్లను నియమించనున్నారు. డైరెక్టర్ పదవులకు 62 ఏళ్ల వయసు మించకూడదని, ఏదేని డిగ్రీ చదివి ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. సంబంధిత రంగంలో కనీసం 15 సంవత్సరాల అనుభవం లేదా ఏదేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో కనీసం 25 సంవత్సరాల వృత్తి అనుభవం ఉండాలి. అదే విధంగా సూపరింటెండెంట్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్‌గా మూడు సంవత్సరాలు లేదా చీఫ్ జనరల్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేటగిరీల్లో మూడేళ్ల అనుభవం ఉండాలని సూచించారు. దరఖాస్తులను మార్చి 2వ తేదీలోపు నేరుగా కాని, ఈ-మెయిల్ ద్వారా కాని సంబంధిత పత్రాలు దరఖాస్తు ఫారానికి జతపరిచి హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు. కాగా డైరెక్టర్ పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. నోటిఫికేషన్ వెలువడుతుందో లేదోనని భావించిన వారు ఇప్పటికే కొందరు దరఖాస్తు చేశారు. డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీతో గతంలో దరఖాస్తు చేసుకున్న ఆశావహులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. నెల రోజుల సమయం ఇవ్వడంతో నియామకాల ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం ఉంది. అప్పటి వరకు ఆశావహులకు ఎదురుచూపులు తప్పవు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీను (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంతండా గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య శ్రీను (39) ఉదయం స్నానం చేయడానికి నీటి కోసం తన ఇంటి ఆవరణలోని నల్లాను తిప్పుతున్నాడు. ఈ క్రమంలో నల్లాకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. కేకలు విన్న స్థానికులు వచ్చి చూసే సరికి శ్రీను అప్పటికే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మాంగిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. .

అధిక ధరలకు విక్రయిస్తున్న వాయిల్స్ కంపెనీపై కేసు

- 55 కొరియానో గొనాడో ట్రాపిన్ వాయిల్స్ సీజ్

ఎంజీఎం: ఓ మెడికల్ స్టోర్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్దేశించిన ధరల కన్నా అధికంగా ముద్రించి విక్రయిస్తున్న వాయిల్స్‌ను (ఇంజక్షన్లను) సోమవారం డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం వివరాలు వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని సెర్టివి మెడికల్ స్టోర్‌లో గైనిక్ వ్యాధులు, ఐవీఎఫ్ పద్ధతులకు సంబంధించిన కొరియానో గొనాడో ట్రాపిన్ వాయిల్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు డ్రగ్ అధికారులు గుర్తించారు. నేషనల్ ఫార్మస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ ప్రకారం ఈ వాయిల్స్‌ను అన్ని రకాల పన్నులతో కలిసి రూ.384.87 కంటే ఎక్కువకు విక్రయించవద్దని పేర్కొన్నారు. కానీ సదరు కంపెనీ నిర్వాహకులు వాయిల్స్‌పై రూ.598.16 ఎమ్మార్పీ ముద్రించి విక్రయించడాన్ని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. అధిక ధరలకు కోడ్ చేసి ఉన్న 55 వాయిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అధిక ధరలకు విక్రయించే కంపెనీలపై కేసు నమోదు చేస్తామని డ్రగ్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ రాజవర్ధన్, ఏడీ రాజ్యలక్ష్మి తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, అరవింద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కటాక్షపూర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శాయంపేట మండలం నేరెడుపల్లికి చెందిన ఎండి.సల్మాన్(26) బైక్‌పై కటాక్షపూర్ నుంచి మల్లంపల్లి వైపునకు వెళ్తున్నాడు. ముందు అతి వేగంగా వెళ్తున్న నల్లబెల్లి మండలానికి చెందిన ద్విచక్రవాహనదారుడు శ్రీనివాస్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో సల్మాన్.. ముందు బైక్‌ను ఢీకొని కిందపడగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ముస్తాఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ రవిరాజు తెలిపారు.

బోర్ లారీ కిందపడి మరో యువకుడు..

స్టేషన్‌ఘన్‌పూర్: బోర్ లారీ కింద నిద్రిస్తున్న యువకుడిని గమనించకుండా డ్రైవర్ వాహనాన్ని ముందుకు తీసుకెళ్లాడు. ఈ ఘటనలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లిలో జరిగింది. సీఐ సట్ల రాజు కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గరియాబాంధ్ జిల్లా గోనాగరీభాకు చెందిన సంతోష్‌కుమార్, రత్తి మంధవి(23), దసపాల్‌నేతమ్, సహదేవ్.. నెలరోజుల నుంచి హైదరాబాద్‌కు చెందిన శివశంకర్ అనే వ్యక్తికి చెందిన వినాయక బోర్‌వెల్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని శివునిపల్లిలో తోట రవి వ్యవసాయ బావి వద్ద మంగళవారం తెల్లవారుజామున బోర్ వేశారు. ఈక్రమంలో హెల్పర్ రత్తి మంధవి బోర్ లారీ కింద పడుకున్నాడు. బోర్ వేయడం పూర్తయ్యాక డ్రైవర్ నంధ్యాల నర్సిరెడ్డి లారీ కింద నిద్రిస్తున్న యువకుడిని గమనించకుండా వాహనాన్ని ముందుకు తీసుకెళ్లాడు. దీంతో రత్తి మంధవి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన సహా కార్మికులు లారీని ఆపి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు సీఐ రాజు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Man Power Service చేయబడును. సంప్ర।। 7659010270. [WA-7277]

■ శ్రీ బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. Govt. ఎంప్లాయ్స్‌కి పర్సనల్ లోన్స్ & ప్లాట్స్ ఇప్పించబడును. వరంగల్, 8522825358. [W-788985]

WANTED

■ వరంగల్, మండి బజార్ ఆఫీసులో పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. వయసు: 25-36, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తెలిసినవారు సంప్ర।। 9997130135 [HA-14068]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।। మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.